(సమగ్ర తెలుగు డిజిటల్ దినపత్రిక)

# ప్రజావేదిక

PRAJA VEDIKA TELUGU DAILY




తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 4 సంచిక : 173 (కాంప్లిమెంటరీ కాపీ) ఎడిటర్:వెంకన్న 01-04-2026 పేజీలు : 6 Digital Edition

## ఏప్రిల్ 2 నుంచి పెద్ద ఎత్తున

# గ్రామసభలు

- సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరణ
- అభివృద్ధిపై ప్రజలకు అవగాహన
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు



**హైదరాబాద్,మార్చి 31 :** ప్రజా పాలన -ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ప్రజా పాలన -ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గ్రామసభలను పెద్ద ఎత్తున నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన ప్రజాభవన్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు. గ్రామ సభలు నిర్వహించే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహాలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను డిప్యూటీ సీఎం ఆదేశించారు. మొదట ముఖ్యమంత్రి సందేశం వినిపించి ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పెద్ద ఎత్తున చదివి వినిపించాలని సూ చించారు. రైతు భరోసా లబ్దిదారుల పేర్లు, 200 యూనిట్ల విచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల మిగతా2లో...

## ఆటో సర్వీసులకు

# గ్యాస్ కొరత

- తక్షణమే సమస్య పరిష్కరించండి: కేంద్రమంత్రి హరిదీప్ సింగ్ పూరికి ఉత్తమ్ లేఖ



**హైదరాబాద్,మార్చి 31 :** హైదరాబాద్‌లో ఎల్‌పీజీ ఆటోరిక్షాలు ఎదుర్కొంటున్న గ్యాస్ కొరతపై కేంద్ర మంత్రి హరిదీప్ సింగ్ పూరికి రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ రాశారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే అదనపు ఎల్‌పీజీ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గృహ అవసరాల కోసం డొమెస్టిక్ ఎల్‌పీజీ సరఫరా 100 శాతం కొనసాగించాలని కోరారు. కమర్షియల్ ఎల్‌పీజీ పంపిణీపై కేంద్ర మార్గదర్శకాలు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఆటో ఎల్‌పీజీ రంగం తీవ్రంగా ప్రభావి తమైందన్నారు. తెలంగాణలో సుమారు 1 లక్ష ఎల్‌పీజీ ఆటోరి క్షాలు రోడ్లపై నడుస్తున్నాయి. ప్రభుత్వ సంస్థల వాటా కేవ లం 20 శాతం మాత్రమే ఉంది. ప్రైవేట్ కంపెనీలు 80 శాతం మార్కెట్‌ను ఆక్రమించాయి. రాష్ట్రవ్యాప్తంగా 110 ప్రైవేట్ ఎల్‌పీజీ ఔట్‌లెట్లు ఉన్నాయి. రోజుకు సుమారు 55 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్‌పీజీ కొరత ఏర్పడింది. అనేక ప్రైవేట్ ఔట్‌లెట్లు మిగతా2లో...



## ఒంటిమిట్టలో వైభవంగా

# బ్రహ్మోత్సవాలు

- నేటి కళ్యాణోత్సవానికి సిఎం చంద్రబాబు దంపతుల రాక

**ఒంటిమిట్ట,మార్చి 31 :** ఒంటిమిట్టలోని ప్రసిద్ధ కోదండరామ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మో త్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.ఇందులో భాగంగా ఏప్రిల్ 1 బుధవారం రాత్రి ఒంటిమిట్ట సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ మహోత్సవానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మిగతా2లో...



- కేరళ ప్రచారం కోసం 30ననే అసెంబ్లీ వాయిదా
- కాళేశ్వరంపై కేంద్రమంత్రి వ్యాఖ్యలు సరికావు
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేత హరీష్

## అసెంబ్లీలో సమస్యలు చర్చకు

# రాకుండా చేశారు

**హైదరాబాద్,మార్చి 31 :** ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వివిధ కారణాలతో అసెంబ్లీ సమయాన్ని వృధా చేశారని మాజీ మంత్రి, డిప్యూటీ ఎ÷-లోర్ లీడర్ హరీష్ రావు అన్నారు. అసెంబ్లీని ఇష్టం వచ్చినట్లు నడిపారని.. అసెంబ్లీలో టీ బ్రేక్ అని చెప్పి, ముఖ్యమంత్రి ఢిల్లీ నుండి వస్తున్నాడని ఒకరోజు, కేరళ నుండి వస్తున్నాడని ఒకరోజు.. నాలుగు గంటలు వృథా చేశారన్నారని ఆరోపించారు. మీడియా సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ.. ఒకరోజు పెండ్లి ఉందని పోతరు, ఒకరోజు ÷నాన్స్ మినిస్టర్ ప్రిపేర్ అవుతున్నాడని అని సభ ఆపేస్తారు. అసలు సభకు వచ్చి ప్రిపేర్ అవుతారా, ప్రిపేర్ అయ్యాక సభకు వస్తారా..? అని హరీష్ రావు ప్రశ్నించారు. ఒకరోజు విద్యుత్ ఉద్యోగులకు చెక్కులు ఇవ్వాలని 4 గంటలు వృథా చేశారని.. మండిపడ్డారు. కేరళ ఎన్నికల కోసం శాసనసభని 30వ తేదీనే బంద్ పెట్టారు. కేరళ ఎన్నికలు మీకు మిగతా2లో...



## చల్లపల్లి

# పోలీస్‌స్టేషన్‌లో పేలుడు

- నలుగురు పోలీసులకు గాయాలు

**విజయవాడ,మార్చి 31 :** కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నలుగురు పోలీసులకు తీవ్రగాయాలయ్యాయి. మందుగుండు సామగ్రిని పోలీసులు బయట నుంచి తీసుకొచ్చి పీఎస్‌లో పరిశీలిస్తుండగా ఈ ఘటన చోటుచేసున్నట్లు సమాచారం. గాయపడిన వారిలో ఎస్పైతో పాటు పోలీసు వాహన డ్రైవర్ దుర్గాంజనేయులు, ఇద్దరు కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరిని వెంటనే స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స మిగతా2లో...

## అసోంలో మహిళలకు మూడువేల తాయిలం

- 31 హామీలతో బిజెపి మేనిఫెస్టో విడుదల




**గౌహతి,మార్చి 31 :** త్వరలో ఎన్నికలు జరగనున్న అస్సాంలో మంగళవారం బిజెపి సంకల్ప పాత్ర పేరుతో 31 హామీలతో మేనిఫెస్టోను విడుదల చేసింది. ఈ హామీల్లో కీలకంగా ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి), మహిళలకు అరుణోదరు పథకం కింద నెలకు మూడువేల రూపాయల్ని నేరుగా తమ బ్యాంకు అకౌంట్లలో జమ చేయడం వంటివి ఉన్నాయి. మేనిఫెస్టో విడుదల సందర్భంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ మాట్లాడుతూ.. 'అస్సాంని ప్రకాశవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే బిజెపి లక్ష్యంగా పెట్టుకుంది' అని ఆయన అన్నారు. ఉత్తరాఖండ్, గుజరాత్ రాష్ట్రాల మాదిరిగానే అస్సాంలో కూడా యుసిసిని అమలు చేయడమే బిజెపి అజెండా మిగతా2లో...

## నలంద ఆలయంలో వద్ద తొక్కిసలాట

- 8మంది మహిళా భక్తులు మృత్యువాత


2లో

## కేరళలో రాహుల్ ఉధృత ప్రచారం

ఎల్‌డిఎఫ్‌తో బిజెపి కుమ్మక్కు

అందుకే శబరిమల ఘటనపై మాట్లాడడం లేదు

మరోమారు విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ నేత


2లో



## మార్జిన్ కోసం చికెన్ దుకాణాదారుల ఆందోళన

- నేటి నుంచి బంద్ పాటిస్తామని ప్రకటన

**హైదరాబాద్,మార్చి 31 :** తెలంగాణలో నేటి నుంచి చికెన్ దుకాణాలు బంద్ కానున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్‌లు పెంచే వరకు నిరవధిక బంద్ పాటిస్తా మని చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ మిగతా2లో...

## ట్యాంక్ బండ్ శివకు 5లక్షల ఆర్థిక సాయం

- అందచేసిన సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,మార్చి 31 :** ట్యాంక్ బండ్ శివకు ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాయం అందించారు. కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థికసాయంతో పాటు అతని కుమారుడు వేణుమాధవ్ కు హోం గార్డు ఉద్యోగ నియామకపత్రం అందజేసారు. ట్యాంక్ బండ్ పై ఎంతో మంది ప్రాణాలను కాపాడిన శివ గురించి ఇటీవల ముఖ్యమంత్రి దృష్టికి చేరింది. ట్యాంక్ బండ్ శివ దీన పరిస్థితిని అర్థం చేసుకున్న సిఎం అతడిని ఆదుకోవడానికి నిర్ణయించారు.ఉపాధి లేక కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్న ట్యాంక్ బండ్ శివకు ఆర్థిక సాయం మిగతా2లో...

# ఏప్రిల్ 2 నుంచి పెద్దఎత్తున గ్రామసభలు

(మొదటి పేజీ తరువాయి)

జాబితాను సాధ్యమైనంతవరకు గ్రామ సభలో చదివి వినిపించాలని ఆదేశించారు. ఇప్పటివరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు జూన్ 2 నుంచి అందరికీ జీవిత బీమా అమలు చేయబోతున్న విషయాన్ని వివరించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం ఆ కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు గ్లాస్ పాలు, మూడు రోజులపాటు రాగి జావా అందిస్తున్న విషయాన్ని వివరించాలన్నారు. ఇంటర్ కళాశాలల విద్యార్థులకు కొత్తగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న విషయం అందరికీ తెలిసేలా వివరించాలన్నారు. వీటిని వివరించే క్రమంలో సాంస్కృతిక శాఖ, పౌర సంబంధాల శాఖ సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తున్నాం, గ్రామాల వారిగా విడుదలైన నిధుల వివరాలను అందుబాటులో పెట్టుకుని గ్రామసభ రోజు ఆ గ్రామానికి ఎంత చేరిందో ప్రకటించాలి అన్నారు. ÷-రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం అవుతున్న తీరును ఎప్పటికప్పుడు చీఫ్ సెక్రటరీ మరియు ప్రణాళికా శాఖ జిల్లా కలెక్టర్ ల నుంచి సమాచారం సేకరిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకే పరిమితం కాదు మౌలిక సదుపాయాల అభివృద్ధి, సేవా రంగాన్ని అభివృద్ధి చేస్తూ ముందుకు

# ఆటో సర్వీసులకు గ్యాస్ కొరత

(మొదటి పేజీ తరువాయి)

డ్రై అవుట్ పరిస్థితి నెలకొంది. ప్రజా రవాణాలో అంతరాయం, ప్రజల్లో ఆందోళన కొనసాగుతోంది. ప్రైవేట్ కంపెనీలకు ఖాజల నుంచి సరఫరా అంతరాయం ఏర్పడిందని లేఖలో మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ ఔట్‌లెట్లలో ఆటో ఎల్‌పీజీ అందుబాటు ఉంచాలని విజ్ఞప్తి చేశార. ప్రైవేట్ కంపెనీలకు తక్షణ సరఫరా కల్పించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఔట్‌లెట్లలో లీటర్‌కు రూ.75, ప్రైవేట్ ఔట్‌లెట్లలో లీటర్‌కు రూ.93 వరకు విక్రయిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ లేఖలో పేర్కొన్నారు. ధరల పెరుగుదలపై నియంత్రణ చర్యలు అవసరమని.. కేంద్రం తక్షణ జోక్యం వల్ల ప్రజా రవాణా సేవలు నిలకడగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# అసెంబ్లీలో సమస్యలు చర్చకు రాకుండా చేశారు

(మొదటి పేజీ తరువాయి)

అవసరం ఏమో..? తెలంగాణ ప్రజలకు, బీఆర్ఎస్ పార్టీకి శాసనసభ ముఖ్యం, ప్రజా సమస్యలు ముఖ్యమని హరీష్ రావు స్పష్టం చేశారు. శాసనసభలో పహిల్వాన్లు అని రేవంత్ రెడ్డి అంటాడు, కత్తులతో తలలు తీసేస్తామని ఇంకో సభ్యుడు అంటాడు. మరి ఇవన్నీ ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయరా..? కాంగ్రెస్ సర్కార్‌ను హరీష్ రావు ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఎన్నోసార్లు అనాగరిక భాష మాట్లాడాడు, మరి అది రిఫర్ చేయరా ఎథిక్స్ కమిటీకి..? అని అడిగారు. మీరు అసెంబ్లీలో మా గొంతు నొక్కే ప్రయత్నం చేసినా, ప్రజాక్షేత్రంలో మిమ్మల్ని నిలదీస్తూనే ఉంటామని హరీష్ రావు హెచ్చరించారు.

రేవంత్ రెడ్డి, సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు మధ్య తేడా లేదని హరీష్ రావు అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వమే అన్ని అనుమతులు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు కూడా కాళేశ్వరం చాలా గొప్ప ప్రాజెక్టు అని ప్రశంసించాయి. నితిన్ గడ్కరీ, పీవీ నరసింహన్ లాంటి ఎందరో ప్రముఖులు కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణాకు వరప్రదాయిని అని అన్నారు.

కేవలం బీఆర్ఎస్ పార్టీ మీద బు రదజల్లడానికే కాళేశ్వరం గురించి తప్పుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒక్క రూ.50 కోట్లు ఇస్తే ఇంకొక 2 లక్షల ఎకరాల ఆయకట్టు వస్తుందని, రెండేళ్ల నుండి దాదాపు 20 లేఖలు రాస్తున్నా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తలేదని అన్నారు. మీకు మా మీ ద కోపం ఉంటే తీర్చుకోండి.. కానీ ఆ కోపాన్ని రైతుల మీద చూపకండని హరీష్ రావు విజ్ఞప్తి చేశారు.

# ఉచిత బస్సుతో మహిళలకు మేలు

**పదివేల కోట్లు ఆదాచేసిన మహిళలు**

**ఆర్టీసీ అభివృద్ధికి అనేక చర్యలు**

**మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

**హైదరాబాద్,మార్చి 31 :** తెలంగాణ ప్రజా భవన్ వేదికగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ప్రగతిపై కీలక ప్రకటన చేశారు. ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని ఆయన గుర్తుచేశారు. డిసెంబర్ 9, 2023న ప్రారంభమైన మహాలక్ష్మి పథకం అద్భుత ఫలితాలను ఇస్తోందని మంత్రి వెల్లడించారు. ఇప్పటివరకు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి.. దాదాపు 10 వేల కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని తెలిపారు. మహిళా ప్రయాణికులను కేవలం ప్రయాణికులుగా మాత్రమే కాకుండా, వారిని ఆర్టీసీకి యజమానులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ప్రతిరోజూ 65 లక్షల మంది ప్రయాణికుల్లో 40 లక్షల మంది మహిళలే ఉంటున్నారని.. 97 డిపోల పరిధిలో రోజూ 35 లక్షల కిలోమీటర్లు బస్సులు తిరుగుతున్నాయని మంత్రి పొన్నం తెలిపారు. ఈ భారీ లక్ష్యాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్న డ్రైవర్లు, కండక్టర్లకు ఆయన ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా రాఖీ వంటి పండుగ దినాల్లోనూ కుటుంబాలకు దూరంగా ఉండి సేవలందించిన కార్మికుల కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో కొందరు కావాలని తప్పుదోవ పట్టిస్తున్నారని, యూనియన్ల పేరుతో రెచ్చగొట్టే చర్యలను మానుకోవాలని హెచ్చరించారు. తెలంగాణకు ఆర్టీసీయే లైఫ్ లైన్ అని ప్రజల రవాణా అవసరాలను తీర్చడంలో ఆర్టీసీ అగ్రస్థానంలో ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీని రాష్ట్రంలోని ప్రతి మూలకు చేర్చేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు. నియోజకవర్గాల వారీగా కొత్త రూట్లు, కొత్త బస్సులు , బస్ స్టేషన్ల అభివృద్ధిపై ప్రజా ప్రతినిధుల నుంచి నివేదికలు తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్‌లో 340 కొత్త రూట్లలో బస్సులను ప్రారంభించామని త్వరలో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని సర్వీసులు అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమంపై స్పందిస్తూ.. బకాయిలను తీరుస్తున్నామని, యూనియన్ల ఏర్పాటు, ఆర్టీసీ విలీనం అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని మంత్రి పొన్నం వెల్లడించారు.



# పసుపు రైతులకు ప్రభుత్వం భరోసా

**తడిసిన పసుపు కొనుగోళ్లకు నిర్ణయం**

**మార్కెట్‌యార్డు అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం**



**హైదరాబాద్,మార్చి 31 :** పసుపు రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉం టుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల అన్నారు. తేమ కలిగిన పసుపును కోతలు లేకుండా కొనుగోలు చేస్తామన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బం దులకు గురి చేయొద్దన్నారు. రైతులను ఇబ్బంది పెడితే మార్కెట్ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిజామాబాద్ మార్కెట్‌కు పసుపు భారీగా వస్తోంది. 1,500 టార్పాలిన్ల పంపిణీ కోసం బిడ్డింగ్ పూర్తి చేశాం. పసుపు కొనుగోళ్లు వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించాం. మేలు రకం పసుపు పంటకు ప్రభుత్వం ఖరారు చేసిన ధర చెల్లిస్తున్నాం. రైతులకు చెల్లింపులు సక్రమంగా జరగాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశాం అని తుమ్మల పేర్కొన్నారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు..పసుపు రైతులకు ఊరటనిస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. అకాల వర్షాలతో పసుపు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని చెప్పారు. తడిసిన పసుపును కోతలు లేకుండా కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని అధికారులను హెచ్చరించారు. మార్కెట్ యార్డు అధికారులు రైతులను ఇబ్బంది పెడితే.. కఠిన చర్యలు తీసుకుంటామంటూ మంత్రి తుమ్మల వార్నింగ్ ఇచ్చారు. . నిజామాబాద్ మార్కెట్‌కు భారీగా పసుపు వచ్చిందన్నారు. 4,500 కుప్పలు (27,400 బస్తాలు) యార్డుకు చేరిందన్నారు. 500 కుప్పలు బహిరంగ ప్రదేశాల్లో నిల్వ ఉందని చెప్పిన మంత్రి.. పసుపు రక్షణకు 1,500 టార్పాలిన్‌లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

# కేరళలో రాహుల్ ఉధృత ప్రచారం

**తిరువనంతపురం,మార్చి 31 :** కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్ ప్రచారం ఉధృతం చేశారు. వరుసగా రెండోరోజు ఆయన వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. అయితే అధికార అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్, బీజేపీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టిందని ఆరోపించారు. అందువల్లే ఈ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ గెలవాలని మోదీ కోరుకుంటున్నారని అన్నారు. బీజేపీతో కూడిన ఎల్డీఎఫ్‌కు, కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్‌కు మధ్యే ఎన్నికల పోరాటం జరుగుతోందన్నారు. కన్నూరులో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేస్తున్న సీపీఎం మాజీ నేతలు వి.కున్హికృష్ణన్, టీవీ గోవిందన్‌లు కూడా రాహుల్ ప్రసంగించిన వేదికపై పాల్గొన్నారు. ఈ ఎన్నికలు రెండు సిద్ధాంతాలకు మధ్య జరుగుతున్న పోరని, తొలిసారి బీజేపీ-లెఫ్ట్ ఫ్రంట్ చేతులు కలపడం అంతా చూస్తున్నామని రాహుల్ అన్నారు. బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టడం ఇష్టంలేకనే ఆ పార్టీలోని కొందరు సీనియర్లు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని చెప్పారు. లెఫ్ట్ ఫ్రంట్ ఇంకెంతమాత్రం వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్‌వింగ్ పార్టీ అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఎక్కడకు వెళ్లినా ఆలయాలు, మతం గురించి మాట్లాడతారని.. కానీ ఇక్కడకు వచ్చినప్పుడు మాత్రం శబరిమల ఆలయంలో బంగారం తాపడాలు మాయం కావడంపై ఎందుకు మాట్లాడటం లేదని రాహుల్ ప్రశ్నించారు. రాష్ట్రంలో లెఫ్ట్ ఫ్రంట్ తిరిగి గెలవాలని ఆయన కోరుకుంటున్నారని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం లేదని అన్నారు. సీపీఎంను బీజేపీ కంట్రోల్ చేస్తోందని, యూడీఎఫ్‌ను మాత్రం కాదని చెప్పారు. తనకు సవాల్ విసరగలిగే సత్తా కాంగ్రెస్‌కు మాత్రమే ఉందనే విషయం మోదీకి బాగా తెలుసునని అన్నారు. మోదీని కాంగ్రెస్ ప్రతిఘటించడం అందరికీ తెలుసునని, కానీ మోదీని కేరళ సీఎం కానీ, కేరళ సీఎంను మోదీ కానీ విమర్శించడం ఎవరూ విని ఉండరని రాహుల్ అన్నారు.

# ఒంటిమిట్టలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

దంపతులు హాజరవుతారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సీఎం దంపతులు సమర్పించనున్నారు. కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం, పుర వీధులు రంగురంగుల దీపాలు, ప్రకాశవంతమైన ప్రదర్శన బోర్డులతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు, పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. మార్చి 26న అంకురార్పణతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఏప్రిల్ 5 వరకు వైభవంగా జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శనం చేసుకుంటున్నారు. మంగళవారం ఉదయం మోహిని అలంకారంలో కోదండరాముడు భక్తులకు దర్శనమిస్తున్నాడు. ఇవాళ రాత్రి గరుడ వాహనంపై ఒంటిమిట్ట పురవీధుల్లో స్వామి వారి ఊరేగింపు నిర్వహించనున్నారు.

# చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

అందిస్తున్నారు. పేలుడు ధాటికి పీఎస్‌లోని ఫర్నిచర్, బయట నిలిపి ఉంచిన వాహనాలు దెబ్బతిన్నాయి. చల్లపల్లి సీఐ కేవీఎస్ రావు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. పేలుడుకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. పీఎస్‌లో పేలుడు ఘటనపై రాష్ట్ర హోంమంత్రి అనిత స్పందించారు. జిల్లా ఎస్పీతో ఆమె మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గాయాలపాలైన పోలీసులకు మెరుగైన వైద్యం అందించాలని అనిత ఆదేశించారు.

# అసోంలో మహిళలకు మూడువేల తాయిలం

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. అలాగే లవ్ జీహాద్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటాం అని ఆయన అన్నారు. యుసిసిని రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల పరిధిలోకి వచ్చే ప్రాంతాల నుంచి మినహాయిస్తామని, గిరిజన వర్గాల్లో దీని అమలు చేయమని ఆయన అన్నారు. రద రహిత అస్సాంను మార్చేందుకు రాబోయే రెండేళ్లలో 18 వేల కోట్లను ఖర్చు చేస్తాం. లక్షపతి దీదీ పథకం కింద 40 లక్షల మంది మహిళలకు 25 వేల రూపాయలు అందిస్తాం. వచ్చే ఐదేళ్లలో రెండు లక్షల జాబ్‌లు ఇస్తాం. ఒక జిల్లా, ఒక కళాశాల, ఒక విశ్వవిద్యాలయం, ఒక ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తాం. అరుణోదరు పథకం కింద ఇస్తున్న రూ. 1250లను పెంచి మహిళలకు 3,000లు అందించడానికి ప్రయత్నిస్తాం అని హిమంతబిశ్వ శర్మ అన్నారు. మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో సిఎం హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, సర్బానంద సోనోవాల్, ఆ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు దిలీప్ సైకియా హాజరయ్యారు.ద

# నలంద ఆలయంలో వద్ద తొక్కిసలాట

**పాట్నా,మార్చి 31 :** బీహార్‌లోని నలందలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. నలందలో ఒక ఆలయం వద్ద తొక్కిసలాట జరిగింది. నలంద జిల్లాలోని శీతలా మాత ఆలయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందారు. అందరూ మహిళలే కావడం గమనార్హం.ఈ ఘటనలో మరో 12 మందికి పైగా గాయపడ్డారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఈ తొక్కిసలాట చోటు చేసుకుంది. నలంద జిల్లాలోని బీహార్ షరీఫ్‌కు దాదాపు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న మఘ్రా గ్రామంలోని శీతలాష్టమి ఆలయం వద్ద ఈ తొక్కిసలాట జరిగింది. చైత్ర మాసంలోని చివరి మంగళవారం కావడంతో, ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అధిక సంఖ్యలో మహిళలు మంగళవారం నాడు ఈ గుడికి వస్తుంటారు. నిర్వహణ లోపం కారణంగానే ఈ తొక్కిసలాట జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పదుల సంఖ్యలో మహిళలు స్పృహ తప్పిపోడిపోయిన దృశ్యాలు కలవరపెడుతున్నాయి. బాగా రద్దీగా ఉండడంతో అంబులెన్స్‌లు కూడా అక్కడకు చేరుకోవడం ఇబ్బందిగా మారింది. గాయపడిన వారికి స్థానికులు సపర్యలు చేస్తున్నారు. చేతులతో ఎత్తుకుని అంబులెన్స్‌ల వద్దకు తీసుకెళ్తున్నారు.

# మార్జిన్ కోసం చికెన్ దుకాణాదారుల ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించింది. గతంలో కంటే మార్జిన్ ఇప్పుడు తక్కువగా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో పౌల్ట్రీ వాళ్లు రిటైల్ దుకాణాలకు కిలోకు రూ.26 మార్జిన్ ఇచ్చేవారని, గత ఇరవై ఏళ్లుగా ఇదే మార్జిన్ ఇస్తున్నారని, ఇటీవల ఈ మార్జిన్ రూ.16 కు తగ్గించారని దుకాణ యజమానులు ఆందోళన వ్యక్తంచేశారు.కేజీ చికెన్ మార్జిన్ రూ.30 ఇవ్వాలని ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అందుకే మార్జిన్ పెంచే వరకు రేపటి నుంచి నిరవధిక బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుతం చికెన్ విక్రయాలపై వస్తున్న లాభాలు తక్కువగా ఉండటంతో షాపులు నిర్వహించడం కష్టంగా మారినట్లు అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు. తక్కువ మార్జిన్ వల్ల వ్యాపారుల జీవనోపాధి సవాల్‌గా మారిందని అంటున్నారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరసన కొనసాగుతుందని తెలిపారు.

# ట్యాంక్ బండ్ శివకు 5లక్షల ఆర్థిక సాయం

(మొదటి పేజీ తరువాయి)

అందించాలని నిర్ణయించారు. ట్యాంక్ బండ్ శివకు అవసరమైన సాయం అందించాలని కొద్ది రోజుల క్రితం అధికారులను ఆదేశించారు. ఉపాధి కోసం ట్యాంక్ బండ్ సమీపంలో ఒక స్విమ్మింగ్ పూల్ నిర్మించి ఇవ్వాలని ట్యాంక్ బండ్ శివ కోరారున ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను సిఎం ఆదేశించారు. శివ కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం చేతులమీదుగా సాయం అందుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన ట్యాంక్ బండ్ శివ, కుటుంబసభ్యులు.

# మాకు సాయం చేయలేదుగా.. ఇక మీ క్రూడ్ ఆయిల్‌ను మీరే తెచ్చుకోండి: ట్రంప్

**ఇరాన్, మార్చి 31 :**ఇరాన్‌పై దాడుల్లో తమకు సహకరించని దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా తన అసంతృప్తిని వెళ్ళగక్కారు. యూఎస్‌కు సహకరించని దేశాలు హోర్ముజ్ జలసంధికి వెళ్లి ముడి చమురును తెచ్చుకోవాలని అన్నారు. అది కుదరకపోతే అమెరికా నుంచి ముడి చమురును కొనుగోలు చేయాలని సూచించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ఆయన పోస్టు పెట్టారు.‘ఇరాన్ విషయంలో యూఎస్‌కు సాయం చేయక చివరకు హోర్ముజ్ జలసంధి నుంచి చమురును తెచ్చుకోలేకపోతున్న బ్రిటన్ వంటి దేశాలకు నేను ఒక సూచన చేస్తున్నాను. మీకు రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి యూఎస్ నుంచి ముడి చమురును కొనుగోలు చేయాలి. మా వద్ద అది సమృద్ధిగా ఉంది. రెండోది కాస్త ధైర్యాన్ని కూడగట్టుకుని హోర్ముజ్‌కు వెళ్లి చమురును తెచ్చుకోవాలి. మీ కోసం మీరు పోరాడటాన్ని ఇకపై మీరు నేర్చుకోవాలి. యూఎస్ మీకు ఎల్లప్పుడూ సాయంగా వస్తుందని అనుకోవద్దు. మీరూ మాకు సహాయం చేయలేదన్న విషయాన్ని మర్చిపోవద్దు. ఇరాన్ దాదాపుగా తుడిచిపెట్టుకుపోయింది. కష్టమైన ఈ పనిని మేము పూర్తి చేశాము. ఇక మీ ముడి చమురును మీరే వెళ్లి తెచ్చుకోండి’ అని ట్రంప్ పోస్టు పెట్టారు.గల్ఫ్ ఉద్రిక్తతలు మొదలై నెల రోజులు దాటిపోయినా ఇరాన్ ఇప్పటికీ హోర్ముజ్‌పై తన పట్టును సడలించని విషయం తెలిసిందే. ఈ జలసంధి మీదుగా చమురు రవాణా కు ఆటంకాలు ఏర్పడటంతో అంతర్జాతీయ మార్కెట్స్‌లో ముడి చమురు ధరలు ఆకాశాన్ని అంటు తున్నాయి.

## తెదేపా కార్యక్రమాలకు తన వంతు సహకారం.విగ్రహావిష్కరణలో నూ ముందడుగు...




**బోనకల్ మార్చి 31 ప్రజావేదిక ప్రతినిధి:**

బోనకల్: పార్టీ స్థాపించిన తొమ్మిది నెలలలో ఆంధ్రప్రదేశ్ (నాటి సమైక్యాంధ్ర) ప్రజల అభిమానాన్ని చూరగొని ముఖ్యమంత్రిగా ఎనలేని సేవలు అందించిన స్వర్గీయ నందమూరి తారక రామారావుపట్ల, అతను ప్రవేశపెట్టిన సంస్కరణలు, ప్రజా సంక్షేమ పథకాల పట్ల ఆ ఎన్ఆర్ఐ యువకుడికి ఎనలేని మక్కువ. మండల పరిధిలోని గోవిందాపురం (ఏ) గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ యువకుడు భాగం రాకేష్ కు ఆంధ్రుల ఆరాధ్య దైవంగా పేరొందిన స్వర్గీయ ఎన్టీఆర్ అంటే మక్కువ ఎక్కువ. నేటి వరకు అదే అభిమానాన్ని కొనసాగిస్తూ జిల్లా వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాలుపంచుకుంటూ పార్టీ కార్యక్రమాలకు తన వంతు ఆర్థిక సహకారం కూడా అందిస్తున్నారు.సోమవారం ఖమ్మంలో తెదేపా కార్యాలయానికి అవసరమైన సౌండ్ సిస్టం కోసం రూ,15 వేలు ఆర్థిక సాయంగా అందించారు.

మూడు రోజుల క్రితం చొప్పకట్లపాలెంలో తన అభిమాన నేత ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు రూ,10 వేలు అందించారు. గతంలోనూ రాయన్నపేట, చింతకాని మండలంలోని పాతర్లపాడు గ్రామాలలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణలలోను పాల్గొని తనవంతు సహకారం అందించారు. స్వచ్ఛమైన, ఆదర్శవంతమైన రాజకీయాలకు నందమూరి తారక రామారావు నిలువెత్తు నిదర్శనమని భాగం రాకేష్ అభిప్రాయపడ్డారు.అదే స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ వంటి ప్రజా నాయకుల స్ఫూర్తితో యువత రాజకీయాల వైపు అడుగులు వేయాలని, నిస్వార్థమైన ప్రజాసేవకు బాటలు వేయాలని ఆయన కోరారు.

## కల్లూరు మున్సిపాలిటీ క్రిష్టయ్యబంజర గ్రామం లో నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం



**కల్లూరు మార్చ్ 31 ప్రజా వేదిక న్యూస్ ప్రతినిధి**

కల్లూరు మున్సిపల్ పరిధిలోని ఎనిమిదవ వార్డ్ కిష్టయ్య బంజర్ గ్రామంలో పసుపులేటి వెంకటేశ్వరావు నాగమణి గార్ల కుమారుడు పసుపులేటి రామకృష్ణ, నాగస్వప్న దంపతులతో వారి స్వగృహం ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మేము గత పది సంవత్సరాల న్నుండి పూరిగుడిసెలో జీవనం సాగించము, తెలంగాణ ప్రభుత్వం పేదవానికి ఇల్లు అన్న నినాదంతో సత్తుపల్లి ఎమ్మెల్యే, మట్టా రాఘమయి దయానంద్ ఆదేశాలతో మాకు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చినారు వారికి మా కుటుంబం తరఫున వారికి ప్రత్యేక ధన్యవాదాలు.ఈ కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగాశీ నీరజ ప్రభాకర్ చౌదరి, యువ నాయకులు ఆళ్లకుంట నరసింహారావు, వార్డు కౌన్సిలర్లు, ఉబ్బన రాంబాబు, శీలం కృష్ణారెడ్డి,పొన్నూరు వెంకటేశ్వరరావు, బైర్ల కాంతారావు, పెద్ద బోయిన శ్రీనివాసరావు,మరియు వారి కుటుంబ సభ్యులు పసుపులేటి శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి దంపతులు, మరియు శివకృష్ణ దంపతులు, గ్రామ ప్రజలు పాల్గొని వారికి ప్రత్యక ధన్యవాదాలు తెలియజేశారు.

## తిర్లాపురం గ్రామంలో నర్సరీని సందర్శించిన టీఏ. వై.కృష్ణయ్య మరియు ఈసి. హుస్సేన్



చింతకాని మండల పరిధిలో తిర్లాపురం గ్రామంలో నర్సరీలోని పెరుగుతున్న మొక్కలను గ్రామపంచాయతీ టీఏ.వై.కృష్ణయ్య మరియు ఈసి. హుస్సేన్ మరియు గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు మరియు పంచాయతీ కార్యదర్శి ఉమారాణి సమక్షంలో నర్సరీలోని మొక్కలుసందర్శించటంజరిగింది.నర్సరీలోపెంచుతున్నమొక్కలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలకు పెంచాలని ఆదేశించారు. ప్రస్తుత వేసవిలో నర్సరీలో పెంచుతున్న మొక్కలకు ఎప్పటికప్పుడు నీరు అందించాలని సూచించారు. మొలకలు రాని బ్యాగులకు మళ్లీ గింజలు నాటాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న మొక్కలకు పురుగు మందు స్ప్రే చేయాలి మరియు ప్రత్యేకంగా మొక్కలకు రక్షణ చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోగుల నరసింహారావు, మడిపల్లి రామకృష్ణ, మడిపల్లి సైదులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తికి ఆదర్శం ముదిగొండ తిరుపతి రావు

### - పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు కట్ట శేఖర్ రావు మండల అధ్యక్షులు కే బిక్షం

**తిరుమలాయపాలెం, మార్చి 31**
**( ప్రజా వేదిక) న్యూస్ ప్రతినిధి**





ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధత, క్రమశిక్షణ, సేవాభావానికి ముది గొండ తిరుపతి రావు ఎస్.ఏ. (బయోసైన్స్) ఆదర్శంగా నిలిచారని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు కట్ట శేఖర్ రావు తిరుమలాయపాలెం మండల అధ్యక్షుడు కే. బిక్షం అన్నారు. మంగళవారం పిండిప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముదిగొండ తిరుపతి రావు పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, మూడు దశాబ్దాల పాటు ఎన్నో పాఠశాలల్లో సేవలందించి వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన గొప్ప ఉపాధ్యాయుడిగా తిరుపతి రావు పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. జూలూరుపాడు మండలం నల్లబండబోడు పాఠశాలలో సెకండ్ గ్రేడ్ టీచర్గా ఉపాధ్యాయ వృత్తిలో అడుగుపెట్టిన ఆయన అంచెలంచెలుగా ఎదుగుతూ 1997 నుంచి 2003 వరకు కొమ్ముగూడెం పాఠశాలలో, 2003 నుంచి 2011 వరకు తల్లాడ మండలం ఎంపీపీఎస్ తల్లాడ పాఠశాలలో, 2011 నుంచి 2025 వరకు ఖమ్మం రూరల్ మండలం కామంచికల్లు ఎంపీపీఎస్ పాఠశాలలో సేవలందించారు. అనంతరం రఘునాథపాలెం మండలంలో విధులు నిర్వహించి, 2025లో బయోసైన్స్ స్కూల్ అసిస్టెంట్గా ప్రమోషన్ పొంది పిండిప్రోలు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాధ్యతలు స్వీకరించారు. పాఠశాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడమే కాకుండా గ్రామంలో ఇంటింటికీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు విశేషంగా శ్రమించారని కే. బిక్షం తెలిపారు. విద్యార్థుల పట్ల ప్రేమ, సహచర ఉపాధ్యాయులతో అనుబంధం, సమాజం పట్ల బాధ్యతతో తిరుపతి రావు గారు ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఆయన పదవీ విరమణ పొందడం సంతోషకరమైనదే అయినా, పాఠశాలలో ఆయన లేని లోటు ఎప్పటికీ ఉంటుందని అధ్యాపకులు, విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారని పేర్కొన్నారు. చివరగా ఆయనకు ఘనంగా వీడ్కోలు పలుకుతూ భవిష్యత్తులో ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. వీడ్కోలు సభకు పిండిప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నామవరపు బాబు అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో టిఆర్టియు మండల ప్రధాన కార్యదర్శి జె నాగేశ్వరరావు గ్రామ సర్పంచ్ కామల్ల సువార్త ఉప సర్పంచ్ చామకూరి రాజు విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## అశ్రునయనాల మధ్య ఆదివాసీ క్రాంతి విరామం

### -గుండెపోటుతో మాజీ మావోయిస్టు, సీనియర్ జర్నలిస్ట్ మృతి

**అశ్వరావుపేట మార్చి 31 ( ప్రజావేదిక ) ప్రతినిధి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలం అడవి బిడ్డల గొంతుక మూగబోయింది. విప్లవ పంథాలో నడిచినా, కలం పట్టి కథనం రాసినా, నిరంతరం అట్టడుగు వర్గాల సంక్షేమం కోసమే పరితపించిన పోతుగంటి క్రాంతి (45) సోమవారం గుండెపోటుతో కన్నుమూశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన ఆయన మరణవార్త విని మండల ప్రజలు, పాత్రికేయ లోకం దిగ్భ్రాంతికి లోనయ్యారు.విప్లవ పథం నుండి అక్షర యజ్ఞం వరకుచిన్నతనం నుండే కమ్యూనిజం భావజాలంతో పెరిగిన క్రాంతి, తొలుత సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీలో చురుగ్గా పనిచేశారు. అనంతరం మావోయిస్టు పార్టీలో చేరి ఛత్తీస్గఢ్లోని దండకారణ్యంలో సుదీర్ఘకాలం గెరిల్లా ఉద్యమంలో




పాలుపంచుకున్నారు. అరెస్టయిన అనంతరం జనజీవన స్రవంతిలో కలిసిన ఆయన, సమాజంలోని సమస్యలను ఎత్తిచూపేందుకు పత్రికా రంగాన్ని వేదికగా చేసుకున్నారు.

జర్నలిస్టుల పెన్నిధి.. ఆదివాసీల వారధి

ప్రస్తుతం 'దిశ' దినపత్రికలో పనిచేస్తున్న క్రాంతి, ములకలపల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా జర్నలిస్టుల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించారు. జర్నలిస్టుల కోసం ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం, తోటి పాత్రికేయులకు ఇళ్ల స్థలాల సాధనలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయం.

ఆదివాసీ గొంతుకగా'ఆదివాసీ జీవన విధానం' యూట్యూబ్ ఛానల్ ద్వారా అడవి బిడ్డల ఆచారాలను, వారి కష్టనష్టాలను బాహ్య ప్రపంచానికి పరిచయం చేశారు. కేవలం జర్నలిస్టుగానే కాకుండా, అనేక సేవా కార్యక్రమాల ద్వారా ఆదివాసీ కుటుంబాలకు అండగా నిలిచారు. క్రాంతి మరణం అడవి బిడ్డలకు ఒక బలమైన గొంతును దూరం చేసింది. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి. పలువురు ప్రముఖుల సంతాపం. ముగిసిన పోరాట యాత్ర కొండకోనల్లో తిరుగుతూ ఆదివాసీల జీవన ప్రమాణాలను అధ్యయనం చేసిన ఆ పరిశోధనాత్మక హృదయం నేడు ఆగిపోయింది. ఆయన మృతితో తిమ్మంపేట గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. క్రాంతి మృతికి రాజకీయ నాయకులు, పౌర సమాజం మరియు పాత్రికేయ మిత్రులు ఘనంగా నివాళులు అర్పిస్తున్నారు.

## కల్లూరు మున్సిపాలిటీ కార్మికులకు ఎనిమిది నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని

### - సీపీఎం పార్టీ సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి వర్గం సభ్యులు తన్నీరు క్రిష్ణార్జునరావు

కల్లూరు మార్చి 31
ప్రజా వేదిక న్యూస్ ప్రతినిధి




కల్లూరు మున్సిపాలిటీ లో పనిచేస్తున్న కార్మికులకు గత ఎనిమిది నెలలుగా వేతనాలు అందడం లేదని కుటుంబ పరిస్థితి భారంగా ఉన్నందున కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని తన్నీరు కృష్ణార్జున రావు డిమాండ్ చేశారు.మాది ప్రజా ప్రభుత్వం,ఈరాష్ట్రంలో ఏఒక్కరికి కష్టం కలిగినా అది నాకష్టం గా ఉంటుందని చెప్పిన ముఖ్యమంత్రి మున్సిపల్ కార్మికులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.మంత్రులు,శాసనసభ్యులు ప్రతినెలా జీతాలు తీసుకోవడం లేదా అని ప్రశ్నించారు.పాశు ధ్య కార్మికులు అంటే ఈ ప్రభుత్వానికి ఎందుకు అంత చులకన అని ప్రశ్నించారు. ఎండనక,వాననక పని చేసినా కూడా వారి మీద దయలేకపోడం దారుణమని అన్నారు.వంటనే వారి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో తాము ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.అదేవిధంగా పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం 26 వేల 750 రూపాయలు ఇవ్వాలని.కార్మికుల రక్షణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం వారికి పూర్తి స్థాయిలో భీమా సౌకర్యం కల్పించాలని,దీని కోసం ప్రభుత్వం వెంటనే చర్యలు



తీసుకోవాలని, పారిశుధ్య కార్మికులకు మాస్కులు,గ్లౌజులు, కోబ్బరినూనె,సబ్బులు,బూట్లు, యూనిఫాం,ఆరోగ్యానికి సంబంధించిన అన్ని సౌకర్యాలుకల్పించాలని,అనివార్యకారణాలవల్ల కార్మికులు చనిపోతే 20లక్షల రూపాయల భీమా ఇవ్వాలని ,అంత్యక్రియలకు 20వేలరూపాయలుఇవ్వాలి.కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాలని,కార్మికులకు వాంతపు సెలవులు ఇవ్వాలని.పండుగలు జాతీయ సెలవు దినాలలో పనిచేసే కార్మికులకు అదనపువేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.అనంతరం మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్ కు,మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ 12 వార్డు కౌన్సిలరు షేక్ ఇస్మాయిల్,బీఆర్ ఎస్ నాయకులు దార్ల నరసింహారావు,సీఐటీయు నాయకులు మీనుగు క్రిష్ణ,వేల్పుల రామారావు, రెడ్డిచర్ల సునిల్,మున్సిపల్ కార్మికులు జయమ్మ,బొల్లం మల్లికార్జున్,సుధాకర్,బొడ్డు సుజాత తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లు పై కుప్పలు తెప్పలుగా చికెన్ వ్యర్థాలను పట్టించుకోని అధికారులు



చింతకాని మార్చి 31 ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు

చింతకాని మండల పరిధిలో నాగులవంచ పరిధిలోతుమ్మలమ్మ చెరువు వెళ్లే రోడ్డు నుండి మత్కేపల్లి (నామవరం) నలబంధం బ్రిడ్జి కాడ – ఖమ్మం –బోనకల్ వైపు వెళ్లే రోడ్డు దుర్వాసన వెదజల్లటంతో ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు వివరాలు ప్రకారం చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు నిత్యం పనుల నిమిత్తం వస్తూ పోతూ ఉంటారు గ్రామాల్లో చికెన్ సెంటర్ నిర్వాకులు పలు వ్యర్థాలను రహదారుల పక్కన బహిరంగ ప్రాంతాలు వదిలి వెళుతున్నారు వాటి నుంచి వస్తున్న దర్బంధం దుర్వాసనతో ప్రజల ఇబ్బందులు గురవుతున్నారు. చికెన్ సెంటర్లోని వ్యర్థాలను గుట్టు సప్పుడు కాకుండా రాత్రి సమయంలో వాహనాల్లో తీసుకొచ్చి రహదారులు పక్కన పారబోస్తున్నారు వ్యర్థాలు కుళ్ళిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి రహదారి వెంట వెళ్లి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు రోడ్డు ఇరువైపులా, ప్రక్కకు వేయడంతో అక్కడకు కుక్కల గుంపు చేరుకొని, ఈ వ్యర్థాలను రోడ్డు పైకి లాక్కొని రావడంతో వాహనదారులు దుర్వాసనతో పాటు కుక్కల భయానికి తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. రోడ్డుపై గుంపులు గుంపులుగా కుక్కలు తిరుగుతూ దారులపై వచ్చేవారిని కరుస్తున్నాయి. కొన్ని కుక్కలకు గజ్జి వ్యాధి పట్టుకోగా స్థానికులకు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో వీధి కుక్కలు కొత్త రోగంతో బక్కచిక్కి పోతున్నాయి. వాటి శరీరంపై ఉన్న బొచ్చు ఊడిపోతుంది. ఈ వ్యాధి ఒకదాని నుండి మరొక దానికి వ్యాపించడం భయాందోళన కలిగిస్తుంది. ద్విచక్ర వాహనాల వెంట, కాలినడకన పోయే వారిపై కుక్కల దాడిలో పలువురు గాయపడ్డ ఘటనలు కూడా ఉన్నాయి. పట్టించుకోవలసిన అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ ఏ మాత్రం చొరవ తీసుకోవడం చోద్యం చూస్తున్నారని విమర్శిస్తున్నారు. ఇకనైనా చికెన్ సెంటర్ నిర్వాహకులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తారో లేదో వేచి చూడాల్సి ఉంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

## హెచ్ పి వి వ్యాక్సిన్ వేయిద్దాం - గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ ను నివారిద్దాం.



### - చింతకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అల్తాఫ్

చింతకాని మార్చి 31 ప్రజా వేదిక ప్రతినిధి:

వీరబాబు మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న హెచ్ పి వీ వ్యాక్సిన్ కేంద్రాన్ని మంగళవారంనాడు చింతకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎంసి చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌పివి వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను సమర్ధవంతంగా నివారించవచ్చని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులలో ఈ వ్యాక్సిన్‌కు వేల రూపాయలు ఖర్చవుతుండగా, ప్రభుత్వ ఆసుపత్రులలో దీనిని పూర్తిగా ఉచితంగా అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అర్హులైన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. చింతకాని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అల్తాఫ్ మాట్లాడుతూ.. 14 నుంచి 15 ఏళ్ల వయస్సు గల బాలికలకు వారి తల్లిదండ్రుల సమక్షంలో హెచ్‌పివి వ్యాక్సిన్ వేయనున్నట్లు వివరించారు. అర్హులైన బాలికలు తమ ఆధార్ కార్డు ఫోటోకాపీని సమర్పించి, అన్ని పనిదినాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీకా తీసుకోవచ్చని తెలియజేశారు. ఈ వ్యాక్సిన్ కార్యక్రమం రేపటి నుంచి మూడు నెలలపాటు కొనసాగుతుందని వైద్య అధికారులు తెలిపారు.

ఈ క్యాంపును జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు , జిల్లా టీకాల అధికారి డాక్టర్ ప్రదీప్ కుమార్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో చింతకాని తహసీల్దార్ బాబ్జి , ఎంపీడీవో శ్రీనివాస్ , మండల విద్యాశాఖ అధికారి రామారావు , ఎస్సై వీరేందర్ , డాక్టర్ అల్తాఫ్, ఆయుర్వేద డాక్టర్ శ్రీదేవి, పీడీఎంఓ, సూపర్వైజర్లు వీరేందర్, కృష్ణారావు, రేచల్ రాణి, వ్యాక్సినేటర్లు పద్మావతి, లక్ష్మి, డేటా ఎంట్రీ ఆపరేటర్లు రజిని, శ్రీనివాస్, స్టాఫ్ నర్సులు సుజాత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై ప్రయాణం చేసే వారందరూ రోడ్డు భద్రత నియమాలు ప్రతిఒక్కరూ పాటించాలి.

చింతకాని మార్చి 31ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు

చింతకానిమండల పరిధిలోని మత్కేపల్లి( నామవరం) బస్ స్టేషన్ పరిధిలోని స్థానిక మంగళవారం రోజు రోడ్డు భద్రత కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు భద్రత నియమాల పై అవగాహన పెంచుకుని ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని చింతకాని పోలీస్ స్టేషన్ సిబ్బంది ఏ. వెంకటేశ్వర్లు మరియు కే. రాములు అన్నారు. ఖమ్మం వైపు రోడ్ పై వెళ్లే మోటార్ వాహనాలు హెల్మెట్ లేని వాహనదారులకు ఆపి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు. రహదారుల



భద్రత అనేది ఒకరి బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, వేగ పరిమితులకు లోబడి డ్రైవింగ్ చేయడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపరాదని అన్నారు. డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ మాట్లాడవద్దని,మలుపులు తిరిగేటప్పుడు ఇండికేటర్లను ఉపయోగించాలి. రోడ్డు దాటేటప్పుడు ముందుగా కుడివైపు, తర్వాత ఎడమవైపు, మళ్ళీ కుడివైపు చూసి, వాహనాలు లేకపోతేనే దాటాలి. వాహన పత్రాలు ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలి.రాత్రి వేళల్లో వాహనం నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి.స్కూల్ బస్సులు లేదా అత్యవసర వాహనాలకు అంబులెన్స్ కు దారి ఇవ్వాలి. ఈ నియమాలను పాటించడం ద్వారా మన ప్రాణాలను ఇతరుల ప్రాణాలను రక్షించుకోవచ్చు అని ప్రయాణికులకు తెలియజేశారు.

## గ్రామాలలో పౌర హక్కులపై అవగాహన సదస్సు

### -అందరూ సమానమనే భావం కలిగి ఉండాలి తహశీల్దార్ బలవంతునికి బలహీనునికి ఒకే హక్కు ఉంటుంది ఎంపీడీవో

కల్లూరు మార్చి31 ప్రజా వేధిక న్యూస్ ప్రతినిధి

తెలంగాణ ప్రభుత్వ షెడ్యూల్ కులముల అభివృద్ధి శాఖ, కల్లూరు మండలం చంద్రుపట్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో పౌర హక్కుల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు తహసిల్దార్ బ్రహ్మేశ్వర్ రావు ఎంపీడీవో డి చంద్రశేఖర్ పాల్గొన్నారు. తాసిల్దార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం రక్షణ



భాగంగా మారుతున్న సమాజం దృష్ట్యా ప్రజలకు పౌర హక్కులపై అవగాహన కలిగి కులం మాత ప్రాధమికంగా షెడ్యూల్ కులాలు ఎస్సీ ఎస్టీ బీసీ లతో అందరూ సమానమనే భావంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఎంపీడీవో మాట్లాడుతూ బావ స్వతంత్ర హక్కు స్వేచ్ఛ హక్కు బలవంతునికి బలహీనునికి ఒకే హక్కు ఉంటుందని అన్నారు. వ్యక్తికి మరొక వ్యక్తికి తెలిసి, తెలియక వివక్షత కొరపడకుండా వాటి నిర్మూలనకు అందరూ సమానత్వం ధోరణి కలిగి ఉండాలని అన్నారు. పౌర హక్కుల పై వాటి ప్రాముఖ్యతను తెలియజేశారు పౌర హక్కులను కాపాడుకోవడానికి అవసరమైన చర్యల గురించి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ హరిప్రసాద్, గ్రామ సర్పంచ్ కాటంనేని విజయలక్ష్మి వెంకటేశ్వరరావు, వైస్ సర్పంచ్ పి. రాధాకృష్ణ, వార్డ్ సభ్యులు, మాజీ సర్పంచ్ గొల్లమందల ప్రసాద్, వల్లభనేని రవి, సెక్రటరీ లక్ష్మణరావు, జిపిఓ మహేష్, ఎస్సీ హాస్టల్ వార్డెన్ రామకృష్ణ బిసి హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వరరావు, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

## కోయగూడెంలో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం..

-పంచాయతీలో నూతనంగా రెండు బోర్లు ఏర్పాటు.
-కోయగూడెం అభివృద్ధి నా లక్ష్యం.
-సర్పంచ్ లింగ్యా నాయక్.

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,మార్చి 31.

బయ్యారం మండలంలో కోయగూడెం గ్రామపంచాయతీ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు సర్పంచ్ లింగ్యా నాయక్ గ్రామంలో నూతనంగా రెండు మంచినీళ్ల బోర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలో కొంతకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను గుర్తించిన సర్పంచ్ వెంటనే స్పందించి,నీటి సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కొత్త బోర్ల ఏర్పాటుకు



అధికారులతో మాట్లాడి నూతన బోర్ల నిర్మాణ పనులను వేగవంతం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లింగ్యా నాయక్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు తాగునీరు,రోడ్లు,డ్రైనేజీ,పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక సదుపాయాలు అందించడం నా బాధ్యత అని,ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రతి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన మంచినీళ్ల బోర్ల వల్ల మహిళలు,వృద్ధులు,రోజువారీగా నీటి కోసం ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు ఎంతో ఊరట లభించిందని తెలిపారు. నీటి సమస్య తీర్చడం పట్ల గ్రామ ప్రజలు సర్పంచ్ లింగ్యా నాయక్ ని అభినందించారు. ఈ కార్యక్రమంలో గొంది రాంబాబు, వార్డు మెంబర్లు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బయ్యారంలో అధిక ధరలకు అమ్మకాలు...

-ఒక్కో క్వార్టర్ కు 30 నుండి 40 రూపాయలు ఎక్కువ అమ్ముతున్న యాజమాన్యం.
=నెల నెల ఎవరి మామూలు వాళ్లకి ఇచ్చేస్తున్నాట్లు ఆరోపణలు.
-మీరు పట్టిచ్చిన మా సరుకు మాకే వస్తుంది.
-తెల్లవారుజామున అక్రమంగా తరలిస్తున్న మద్యం.
-బెల్ట్ షాపుల నివారణపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం.
-బరితెగించిన బయ్యారం వైన్స్ సిండికేట్ వ్యాపారులు.
-భూక్య రవి నాయక్ సేవాలాల్ సేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి..

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,మార్చి 31.

బయ్యారం మండలంలో మద్యం వ్యాపారులు అడ్డూ అదుపూలేని దోపిడీకి పాల్పడుతున్నారని,ఒక్కో క్వార్టర్ పై బీరు సీసాలపై ఎమ్మార్పీ ధర కంటే 20నుండి 30రూపాయలు అదనంగా తీసుకొంటున్నారని,బెల్టు షాపుల్లో దీనిపై




మరో 20 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి భూక్య రవి నాయక్ ఆరోపించారు. మంగళవారం బయ్యారం మండల కేంద్రంలో సేవాలాల్ సేనా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బెల్టు షాపులను రద్దు చేయాలని విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా లేనివిధంగా బయ్యారం గార్ల మండలాల్లో మద్యం వ్యాపారులు సిండికేట్ గా మారి ప్రజలను విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్నారన్నారు. బయ్యారం మండలంలో 250 బెల్టు షాపులు నడిపిస్తూ రోజూ తెల్లవారు జామున ఆటోలతో బే ఫికర్ గా మద్యం సరఫరా చేస్తున్నారని,లైసెన్స్ షాపులోనే ఒక్కో క్వార్టర్ బాటిల్ పై ఎమ్మార్పీ కంటే 25 రూపాయలు అదనంగా తీసుకొంటున్నారని అన్నారు. బెల్ట్ షాపుల నివారణపై నిర్లక్ష్యం వహించిన,మద్యం వ్యాపారుల ఆక్రమ దోపిడీని అరికట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుగులోతు నరేష్ నాయక్,భూక్య లక్ష్మా నాయక్,రూప్లా నాయక్,శ్రవణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఎఫ్ టీయు జిల్లా జనరల్ కౌన్సిల్ ను జయప్రదం చేయండి.

-రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ కే.మదార్.

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,మర్చి 31.

భారత కార్మిక సంఘాల సమాఖ్య మహబూబాబాద్ జిల్లా జనరల్ కౌన్సిల్ కరపత్రాలను మంగళవారం బయ్యారం మండల మాతవైష్ణవి టైల్స్ ఫ్యాక్టరీలో,కాచనపల్లి గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇఫ్ట్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్ కే.మదార్ మాట్లాడుతూ కేంద్రంలో వరుసగా మూడవ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తూ,కార్మిక చట్టాలను సవరణ చేసిందని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం అధీనంలో ఉన్న 44కార్మిక చట్టాలలో 15కార్మిక చట్టాలను రద్దు చేసి




29 కార్మిక చట్టాలను 4లేబర్ కోడ్ లుగా సవరణ చేసిందని, ఈ నాలుగు లేబర్ కోడ్ ల వలన యావత్ భారత దేశ వ్యాప్తంగా ఉన్న కార్మిక వర్గానికి తీవ్రమైన నష్టం జరుగుతుందని అన్నారు. పూర్తిగా కార్పొరేట్ శక్తులకు, బడావ్యాపారస్తులకు అనుకూలంగా కార్మిక చట్టాలను సవరణ చేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏప్రిల్ 5న బయ్యారంలో జరుగు ఐఎఫ్ టీయు మహబూబాబాద్ జిల్లా జనరల్ కౌన్సిల్ ను జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఇఫ్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కన్మంతరెడ్డి,భాస్కర్ రెడ్డి,సావడి దుర్గాప్రసాద్,ఆదినారాయణ, కోటేష్,పద్మ,రాజు,మనోజ్ బాబు, చంద్,వెంకటేష్,లక్ష్మీపతి,శివ తేజ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాలను, మరణాలను తగ్గించడమే తమ ప్రధాన లక్ష్యమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్











నేలకొండపల్లి మార్చి 31 ప్రజా వేదిక న్యూస్

నేలకొండపల్లి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టాలను తగ్గించాలనే సంకల్పంతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మూడోవ విడత 'అరైవ్.. అలైవ్' ప్రచార కార్యక్రమాన్ని మంగళవారం నేలకొండపల్లి శ్రీకర ఫంక్షన్ హాల్ నందు నిర్వహించారు.

అందులో భాగంగా నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఆటో యూనియన్, మార్కెట్ యూనియన్లు, విద్యార్థులు, స్థానిక ప్రజలతో శ్రీకర ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ..

దేశ వ్యాప్తంగా రోజురోజుకి పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రత ప్రాముఖ్యతను ప్రతి పౌరుడి మనసులో బలంగా నాటేందుకే అరైవ్ అలైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు మీ కోసం ఇంట్లో ఎదురుచూసే భార్యాపిల్లలను గుర్తుకు తెచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమం ద్వారా ప్రజలకు సురక్షిత డ్రైవింగ్ సంస్కృతిని అలవాటు చేసి, రోడ్డు భద్రతా వ్యవస్థలను పటిష్ఠం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు, ప్రముఖులు, మీడియా, ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో రోడ్డు భద్రతలో తెలంగాణను దేశానికే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నది తమ ధ్యేయమని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం, కార్లలో సీటు బెల్టులు పెట్టుకోకపోవడం, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వాడడం, మద్యం సేవించి నడపడం, సిగ్నల్ జంప్, స్టాప్ లైన్ దాటడం, హైవేలపై ఆటోల ఓవర్ లోడింగ్, ఎడమవైపు నుంచి ఓవర్ టేకింగ్ వంటి ప్రమాదకర అలవాట్లపై ఈ ప్రచారంలో ప్రత్యేక దృష్టి పెట్టామని ఆయన తెలిపారు. ట్రాఫిక్ ఉల్లంఘనలపై జరిమానా విధించడం తిరిగి తప్పిదాలు జరగకుండా జాగ్రత్త తీసుకుంటారని ఉద్దేశ్యమేనని అన్నారు. అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి ప్రతి వ్యక్తికి చేరవేసి ప్రమాద రహిత జిల్లాగా నిర్మించేందుకు సమావేశానికి వచ్చిన అందరూ కట్టుబడి ఉండాలని స్పష్టంగా స్పష్టం చేశారు. ప్రమాదాన్ని చూసిన వెంటనే సహాయం చేసే వారికి ప్రభుత్వం రహవీర్ గా గుర్తించి నగదుతో ప్రోత్సాహిస్తుందని, పోలీసులు గౌరవం అందిస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు. రోడ్డు ప్రమాదాల జరగకుండా వేగం నియంత్రణ సూచిక బోర్డులను పోలీస్ కమిషనర్ స్వయంగా ఏర్పాటు చేశారు.

గ్రామ సర్పంచులు. బోదులబండ గ్రామ సర్పంచ్ కట్టే కోల నాగార్జున, మాట్లాడుతూ ప్రతి ఒక్క పౌరుడు నేను జాగ్రత్తగా ఉన్నా అనుకున్నంత మాత్రాన సరిపోదని ఎదురుగా వచ్చే మనిషిని పూర్తిగా గమనిస్తూ డ్రైవ్ చేయాలని సెల్ఫోన్ మాట్లాడుతూ చెవి కాడ పెట్టుకొని వంకరగా చూస్తూ నడపడం వల్ల ఎక్కువ శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని ఎదుటివాడు మంచి గా వచ్చిన సెల్ఫోన్ వల్ల ప్రమాదాలు ఎక్కువ జరిగే అవకాశం ఉందని అతివేగంగా వెళ్ళటం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని క్షేమంగా వెళ్లి క్షేమంగా ఇంటికి చేరాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఏసిపి తిరుపతిరెడ్డి, ఎస్ఐ సంతోష్, ఏఎస్ఐ లతీఫ్, పోలీస్ కానిస్టేబుల్స్.

సర్పంచులు నేలకొండపల్లి సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి,ముఠాపురం సర్పంచ్ ఏలూరి రామారావు, రాయి గూడెం సర్పంచ్ బోయిన వేణు, చెరువు మాదారం సర్పంచ్ అమర గాని ఎల్లయ్య, రాజేశ్వరపురం సర్పంచ్ దండా రంగయ్య, మంగ్రాజు పల్లి సర్పంచ్ రావూరి కోటేశ్వరరావు,

కమదన ప్రవీణు, ఆటో యూనియన్ నాయకులు చలమయ్య, లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు రాజకీయలు బచ్చలకురి నాగరాజు, జెర్రీ పోతుల అంజని, కె.వి.రెడ్డి, ఎటుకూరి రామారావు, రచ్చ నరసింహారావు, విద్యార్థులు ప్రైవేట్ ఉపాధ్యాయులు. తదితరులు పాల్గొన్నారు

